అధ్యక్షా!



- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్
- అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించాం
- ఆ మేర కేటాయింపులు ఉంటాయని ఆశిస్తున్నాం
- సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో శాసన సభ సభ్యులు



ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. ఇప్పటికే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించామని, ఆ మేర కేటాయింపులు కచ్చితంగా ఉంటాయని శాసన సభ్యులు అభిప్రాయపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తితో పాటు, విద్య, వైద్యం, గ్రామీణ రోడ్లకు నిధులు ఇవ్వాలని కోరతామని చెప్పారు. వివరాలు వారి మాటల్లోనే..

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధానంగా పెండింగ్ ప్రాజెక్టులపై బడ్జెట్‌లో నిధులు వచ్చే అవకాశం ఉంది. పాలమూరు-రంగారెడ్డికి పెద్ద పద్దు కేటాయిస్తారు. వీటితోపాటు విద్య వైద్యం రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు ద్వారా నైపుణ్యం పెంచే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయి.

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఉదండాపూర్ ఆర్‌అండ్‌ఆర్‌పై ఆశలు



ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో రూ.800 కోట్ల మేర ప్రతిపాదనలు పంపించాము. ఈ నిధులు బడ్జెట్‌లో వస్తాయని ఆశిస్తున్నాము. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకూ ప్రతిపాదన పంపించాం. ముఖ్యంగా బైపాస్ రోడ్డు, జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం నిధులు వస్తాయని ఆశించాం. కానీ నిరాశ మిగిలింది. విద్య, వైద్యం, ఇరిగేషన్, రోడ్లపై ప్రధాన దృష్టితో పని చేస్తున్నాము.

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే

రూ.1,680 కోట్లతో ప్రతిపాదనలు



వనపర్తి నియోజకవర్గంలో సాగు నీరు, విద్య, వైద్య రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం రూ.1,680 కోట్లతో సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు అందజేశాం. సీఎం చదువుకున్న వనపర్తి పాఠశాల, కళాశాలల అభివృద్ధికి రూ.160 కోట్లు, వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మాణం, ఏదుల రిజర్వాయర్‌కు బుద్దారం కుడి, ఎడమ, ఘణపురం బ్రాంచ్ కాలువలను లింక్ చేయడానికి ప్రతిపాదన చేశాం. డీ5, డీ6, డీ7 కాలువల వెడల్పునకు నిధులు కోరాము.

తూడి మేఘారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే

పర్యాటక అభివృద్ధికి నిధులు కోరాం



నల్లమల ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించాం. మద్దిమడుగు, మల్లెలతీర్థం, అక్కమహాదేవి గుహలను పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరాం. అచ్చంపేట లిఫ్టు ఇరిగేషన్ కలను సాకారం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశాం. విద్యాపరంగా కూడా నల్లమల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం.

- చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే

వైద్య సదుపాయాలపై అడుగుతా



కల్వకుర్తి నియోజకవర్గ ప్రజానీకానికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనేది నా అభిమతం. ఆ దిశగా కల్వకుర్తిలో వంద పడకల ఆస్పత్రి స్థాయిలో వైద్య సదుపాయాలు కల్పించాము. ఆమనగల్లులో 50 పడకల ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభ్యర్థిస్తాం. ఆ దిశగా ఆయన కల్వకుర్తి నియోజకవర్గానికి మేలు చేకూరుస్తారని ఆశిస్తున్నా. విద్యాపరంగా కూడా నియోజకవర్గ పరిధిలో వినూత్నమైన మార్పులు చోటు చేసుకోనున్నాయి.

- కశిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

పెండింగ్ పనులకు ప్రతిపాదనలు



దేవరకద్ర నియోజకవర్గంలోని కోయిల్‌సాగర్ పెండింగ్ పనులకు ప్రతిపాదనలు పంపించాం. రూ.120 కోట్లతో రోడ్లు, రూ.120 కోట్లతో కోయిల్‌సాగర్ పెండింగ్ వర్క్స్ పనులను ఎస్టిమేషన్స్ ఇచ్చాము. దేవరకద్ర పట్టణంలో 100 పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, కురుమూర్తి గుట్టపై ఘాట్ రోడ్డు, కానాయపల్లి గ్రామ పునరావాస పనులకు నిధులు దక్కుతాయని ఆశిస్తున్నాం.

- మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే

ముంపు గ్రామాల సమస్యలు వినిపిస్తా



మక్తల్ నియోజకవర్గంలోని ముంపు గ్రామాలైన నేరడ్‌గాం, భూత్పూర్, అనుగొండ, అంకెన్‌పల్లి, దాదన్‌పల్లి గ్రామాల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో కోరతా. పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లలో మౌలిక వసతులు సమకూర్చలని సభ దృష్టికి తీసుకెళ్తా. మక్తల్‌కు మంజూరైన డిగ్రీ కళాశాల, కోర్టు సొంత భవనాల మంజూరుకు కృషి చేస్తా. పాఠశాలల భవనాలు, ఉపాధ్యాయుల భర్తీ, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడుగుతా.

- వాకిటి శ్రీహరి, మక్తల్ ఎమ్మెల్యే

మెటర్నరీ.. చైల్డ్ ఆస్పత్రి అత్యవసరం



నారాయణపేట నియోజకవర్గంలో మెటర్నరీ చైల్డ్ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో అడుగుతా. ప్రతీ గ్రామానికి రోడ్డు కోసం రూ.100 కోట్లు ఇవ్వాలని కోరతా. ధన్వాడలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం, మరికల్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పీహెచ్‌సీలకు సొంత భవనాలు, వైద్యుల భర్తీ, మౌలిక వసతులు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చెరువుల సామర్థ్యం పెంపు తదితరాలను సభ దృష్టికి తీసుకెళ్తా.

- చిట్టెం పర్ణికారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే

నెట్టెంపాడు సామర్థ్యం పెంచాలి



జోగుళాంబ గద్వాల జిల్లాలో మెజారిటీ ఆయకట్టుకు నీరందించే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌తో పాటు గట్టు ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల సామర్థ్యం 20 టీఎంసీలకు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాము. నియోజకవర్గంలో రూ. 100 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేటాయింపులు దక్కే అవకాశం ఉంది.

- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే

విద్య, వైద్యమే ప్రధానం



అలంపూర్ విద్య, వైద్యంలో వెనుకబడి ఉంది. రాజోలి, శాంతినగర్, అయిజ పట్టణాల్లో డిగ్రీ కళాశాలలు, గురుకుల పాఠశాలలకు నూతన భవనాలు కోరుతా. నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లు పూర్తి అధ్వాన్నంగా ఉన్నాయి. వంద పడకల ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలని, కర్నూలులోని మూడు ప్రధాన ప్రైవేటు ఆస్పత్రుల్లో మనప్రాంతం వారికి ఆరోగ్యశ్రీ వర్తించేలా చూడాలని కోరతా. నెట్టెంపాడు 99 ప్యాకేజీ, జూరాల పనులపై అడుగుతా.

- విజయుడు, ఎమ్మెల్యే అలంపూర్

నార్లాపూర్ రెండో పంపు ప్రారంభానికి రెడీ

- రెండు వారాల్లో డ్రై రన్
- అంజనగిరి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసేలా ఏర్పాట్లు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సర్జిపూల్

కొల్లాపూర్, జూలై 24: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నార్లాపూర్ పంపుహౌస్ రెండో మోటారు నుంచి అంజనగిరి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోయాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు సాగు, తాగునీరు అందించే ఉద్దేశంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను 18 ప్యాకేజీలుగా విభజించారు. ప్యాకేజీ-1లో పంపుహౌస్, సర్జిపూల్, అప్రోచ్ కెనాల్, ఇంటెక్ స్ట్రక్చర్, టన్నెల్ నిర్మాణ పనులను చేపట్టారు. గత ఏడాది సెప్టెంబరు 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నార్లాపూర్ పంపుహౌస్ నుంచి ఒకటో మోటారును ప్రారంభించి, అంజనగిరి రిజర్వాయర్‌కు రెండు టీఎంసీల నీటిని విడుదల చేశారు. తర్వాత మోటారును బంద్ చేశారు. ఈ ఏడాది ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు అనుకున్న సమయానికంటే కృష్ణానదికి ముందుగా ఆశించిన స్థాయిలో వరద జలాలు చేరాయి. ఇప్పటికే ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా వరద జలాలను ఎత్తిపోసి, రిజర్వాయర్లను నింపారు. అదే క్రమంలో ఈ సీజన్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ పంపుహౌస్‌లో పూర్తయిన రెండో మోటారుకు 10.. 15 రోజుల్లో డ్రై రన్ చేసి, అంజనగిరి రిజర్వాయర్‌కు మరో రెండు టీఎంసీల నీరు ఎత్తిపోయాలని అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. నార్లాపూర్ పంపుహౌస్‌లో మొత్తం తొమ్మిది మోటార్లకు గాను ఒకటి, రెండు మోటార్ల పనులు పూర్తయ్యాయి. మూడో మోటారు పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి. నాల్గో మోటారు పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. 145 మెగావాట్ల సామర్థ్యం గల ఒక్కో మోటారు ద్వారా రోజూ 1.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం వరద జలాలు చేరడంతో ప్రాజెక్టు అప్రోచ్ కెనాల్ పనులు నిలిచిపోయాయి. గుత్తేదారులు సామగ్రిని ఎగువ ప్రాంతానికి తరలించారు. ప్రస్తుతం సిస్టర్న్, పంప్‌హౌస్‌లో మోటారు పనులు జరుగుతున్నాయి.

కొనసా..గుతున్న అంజనగిరి రిజర్వాయర్ పనులు

ప్రాజెక్టులో ప్రధాన భూమిక పోషించే 6.40 టీఎంసీల అంజనగిరి రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తయినా.. బండ్, రివిట్‌మెంట్ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. అదేవిధంగా సున్నపు తండా వద్ద నిర్మించిన హెడ్ రెగ్యులేటరీ వద్ద కాల్వ పనులు కుడికిళ్ల, తీర్నాంపల్లి వైపు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. మరో వైపు ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోయిన నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించ లేదు. అంజనగిరి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన సున్నపు తండా, అంజనగిరి, వడ్డెర గుడిసె నిర్వాసితులకు పునరావాసం కల్పించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించాల్సి ఉంది. మరికొంత మంది రైతులకు పరిహారం రావాలి.

మారుతున్న నిర్ణయాలు

రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులపై నిర్ణయాలు మారుతున్నాయి. ఇటీవలే రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సాగునీటి నిపుణులు, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు అడ్డగోలుగా ఖర్చు చేసినా.. కిలో మీటరు మేర కూడా సాగునీరు ముందుకు పారించలేకపోయిందని విమర్శించారు. త్వరలోనే రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రిని ప్రాజెక్టుకు వద్దకు తీసుకొచ్చి, రాష్ట్ర ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరేలా పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- గుడిపల్లి గట్టు రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సాగునీటి విడుదల



నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి జూపల్లి; చిత్రంలో ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం మండలంలోని గుడిపల్లి గట్టు రిజర్వాయర్ నుంచి మూడు లక్షలా 60 వేల లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రిజర్వాయర్ల ద్వారా ప్రతీ రోజు 650 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేలా కృషి చేస్తామన్నారు. ఎంజీఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూడా పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష చేసినట్లు గుర్తు చేశారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమష్టి సహకారంతో ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయగలుగుతామని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, మెఘారెడ్డి హాజరయ్యారు. ఇరిగేషన్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, రవీందర్ కృష్ణానదిలో నీటి లభ్యత, విద్యుత్ వినియోగంపై మంత్రికి వివరించారు.

కత్తెర.. కాన్పులు



- మహబూబ్‌నగర్‌లోని ప్రైవేటు దవాఖానాల్లో యథేచ్ఛగా సిజేరియన్ ఆపరేషన్లు
- 70 శాతం మేర సర్జరీలు చేస్తున్న ఆస్పత్రులు 23
- కాసుల కోసం కక్కుర్తి.. అమలుకాని ఈ బర్త్ పోర్టల్ నమోదు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జులై 24: నవమాసాలు మోసి సుఖ ప్రసవం కావలసిన తల్లుల కడుపుపై కత్తెర కాట్లు పడుతున్నాయి. కాసుల కోసం ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కక్కుర్తి పడుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా యదేచ్ఛగా సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో 70 శాతం వరకు సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు. సాధారణ కాన్పు కావలసిన వారికి సైతం సిజేరియన్ ఆపరేషన్లు చేస్తూ ప్రభుత్వ ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారు. ప్రైవేటు పరిదిలోని ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో 70 శాతానికి పైబడి సిజేరియన్లు చేస్తున్న ఆసుపత్రులు 23 ఉన్నాయి. ఈ బర్త్ పోర్టల్‌లో నమోదైన గణాంకాలు ప్రైవేటు ఆసుపత్రుల బండారాన్ని బయట పెట్టాయి. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించడం లేదు.

సాధారణ కాన్పు చేస్తామని చెప్పి..

మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 180 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు ఉన్నాయి. అందులో యథేచ్ఛగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఆస్పత్రికి రాక ముందు నార్మల్ డెలివరీ చేస్తామని నమ్మబలుకుతున్నారు. ఆస్పత్రిలో చేర్చుకున్నాక.. నొప్పుల ఇంజక్షన్లు ఇస్తున్నామని, దారి కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పి ఒకటి, రెండు రోజులు డ్రామా ఆడుతున్నారు. ఆ తర్వాత సాధారణ కాన్పు సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. వెంటనే ఆపరేషన్ చేయాలని, లేదంటే ఉమ్మనీరు తగ్గిపోయి తల్లీ బిడ్డకు ప్రమాదం అని చెప్పి భయాందోళనలకు గురిచేస్తున్నారు. దీంతో ఎటూ తేల్చుకోలేని రోగి బంధువులు చేయండి చెప్పడంతో వారి సంతకాలు తీసుకొని సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు. ఇలా ప్రతీ ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.

70 శాతానికి పైగా..

సిజేరియన్ ఆపరేషన్లు విపరీతంగా పెరుగుతున్నాయని ఓ అధ్యయనంలో తేలడంతో వాటిని నిరోధించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఇటీవల ఈ బర్త్ పోర్టల్‌లోని వివరాలను పరిశీలించడంతో జిల్లాలో ఉన్న ప్రైవేట్ నర్సింగ్ హోంలు, ఆస్పత్రుల్లో 70 శాతం వరకు సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారని గుర్తించారు. అందులో ప్రధానంగా 23 ఆస్పత్రులలో 70 శాతానికి మించి శస్త్రచికిత్సలు చేస్తున్నారని తేలడంతో వారికి నోటీసులు జారీ చేశారు. అందులో తేజాస్ హాస్పిటల్ 67.37 శాతం, మా 67.37, ఎస్ఎస్ 68.78, ఎస్వీఎస్ 69.55, మైత్రి 71.79, అనిరుద్ 72.84, సిద్ది వినాయక 88.74, సుశ్రుత ప్రజావైద్యశాల 76, ఆర్వీఆర్ ఆస్పత్రి 64.09 శాతం ఆపరేషన్లు చేస్తున్నట్లు తేలింది. అనిల్ సర్జికేర్ 73.42, సంజన పాలమూరు నర్సింగ్ హోం 94.38, సాయిచందన నర్సింగ్ హోం 97.73, సిమ్స్ 89.06, మేఘన 94.92, కవిత నర్సింగ్ హోం 100 శాతం, డా.వీకె. రాజ్‌పురోహిత్ మెమోరియల్ అన్నపూర్ణ 70.97, కేకే 83.33, నితిన్ 80, అమృత 100 శాతం, సాయి శిల్ప 100, సాన్వి మల్టి స్పెషాలిటీ 95, శ్రీసాయి శశికళ 93.75, ఎల్‌వీ హాస్పిటల్‌లో 78.57 శాతం సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు.



అమలుకాని ఈ-బర్త్ పోర్టల్ నమోదు..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లను నిరోధించేందుకు, సాధారణ కాన్పులను ప్రోత్సహించేందుకు, లింగనిర్ధారణ పరీక్షలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఈ-బర్త్ పోర్టల్‌ను అమల్లోకి తెచ్చింది. అందులో భాగంగా ఆస్పత్రుల్లో రోజూ జరిగే కాన్పుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఈ-బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలి. పుట్టిన బిడ్డ వివరాలు, ఆపరేషన్ ఎందుకు చేయాల్సి వచ్చింది?, ఇబ్బందులేమిటి?, మాతా, శిశు మరణాలు వంటి వివరాలు ఆ పోర్టల్‌లో నమోదు చేయాలి. ఈ వివరాలను పరిశీలించేందుకు రాష్ట్రస్థాయిలో ఓ యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఉద్దేశపూర్వకంగా అబార్షన్ గానీ, సిజేరియన్ గానీ చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకోవడానికి వీలుంది. కానీ ఆ పోర్టల్ అమలు కావడం లేదు. అన్ని వివరాలు అందులో నమోదు చేయడం లేదు. నెలలో వచ్చిన కొన్ని కేసుల వివరాలు మాత్రమే నమోదు చేసి, చేతులు దులుపుకుంటున్నారు.

రూ.70 వేలు వసూలు

ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. ఒక్కో సిజేరియన్ ఆపరేషన్‌కు ఒక్కో ఆస్పత్రిలో ఒక్కో రేటు ఫిక్స్ చేశారు. అందులో స్థాయి పెద్దగా ఉన్న ఆస్పత్రిలో రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు రేటు ఉండగా, మరికొన్ని చిన్న ఆస్పత్రుల్లో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. మందులు, ల్యాబ్ ఫీజులకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. నార్మల్ డెలివరీ అనే మాట ఎక్కడా వినిపించడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ..

సిజేరియన్ కాన్పులపై జిల్లాలో పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. విచ్చలవిడిగా ఆపరేషన్లు చేయడంతో పాటు ఫీజులు కూడా అదేస్థాయిలో వసూలు చేస్తున్నారు. 80 నుంచి 100 శాతం సిజేరియన్లు చేస్తున్న తీరును చూస్తే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆపరేషన్ చేస్తే భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే విషయాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పొచ్చు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు చేయకపోవడంతోనే సిజేరియన్ ఆపరేషన్లు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఇలాగే కొనసాగితే మాతాశిశు మరణాలు కూడా పెరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిలిండర్ పేలిన ఘటనలో విషాదం

- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ భార్యాభర్తల మృతి



సోడె వెంకటయ్య, చిట్టెమ్మ(ఫైల్)

గోపాల్‌పేట, జూలై 24 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని మున్ననూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకున్నది. సోడె వెంకటయ్య (55), అతని భార్య సోడె చిట్టెమ్మ(50) గ్రామంలోని తన సొంత ఇంటిలో నివసిస్తూ వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేవారు. ఈ నెల 18న ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అవుతుందని గ్రామానికి వచ్చిన ఓ గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్ మండ్ల శంకర్‌తో మరమ్మతు చేయిస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో గ్యాస్ లీకై పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో సిలిండర్ పక్కన ఉన్న వెంకటయ్య, చిట్టెమ్మ, డెలివరీ బాయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి తలుపులు, వస్తువులు ధ్వంసం అయ్యాయి. ఇది గమనించిన ఇంటి చుట్టుపక్కల వారు క్షతగాత్రులను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటయ్య మంగళవారం సాయంత్రం మృతి చెందగా, చిట్టెమ్మ బుధవారం ఉదయం మృతి చెందింది. భార్యాభర్తల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండ్ల శంకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నది. ఈ సంఘటనపై బాధితుల బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మృతదేహాలకు నివాళులు అర్పించారు.

పేకాట ఘటనపై విచారణ అధికారిగా అదనపు ఎస్పీ

- బాధితులు ఉంటే సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూలై 24: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో పేకాట స్థావరంపై దాడి సందర్భంగా వస్తున్న ఆరోపణలపై విచారణ అధికారిగా జిల్లా అదనపు ఎస్పీ గుణశేఖర్‌ను నియమిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడికి సంబంధించి పలు ఆరోపణలు రావడంతో ఎస్పీ ఒక ప్రకటనను వడుదల చేశారు. ఈ ఘటనపై అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో పూర్తి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఘటనలో పోలీస్ అధికారులపై గాని, సిబ్బందిపై గాని ఆరోపణ రుజువైతే వారిపై తప్పకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే బాధితులు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి నేరుగా లేదంటే ఫోన్‌లో తమను సంప్రదించి ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి, నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడుతాయని ఎస్పీ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- మహిళను కాపాడిన పోలీసులు



ఎర్రవల్లి పోలీస్ అవుట్‌పోస్టులో బాధితురాలికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఎర్రవల్లి, జూలై 24 : కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓ వివాహితను ఇటిక్యాల పోలీసులు కాపాడారు. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన భవానీ తమ కుటుంబంలో నిత్యం జరుగుతున్న గొడవల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నది. బుధవారం ఉదయం బీచుపల్లి వద్ద కృష్ణానదికి చేరుకున్నది. నదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న బ్లూకోట్ పోలీసు సిబ్బంది ఆమెను గమనించి అడ్డుకొని కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ఇంటర్‌లో చేరేందుకు 26, 27 తేదీల్లో స్పాట్ అడ్మిషన్స్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 24 : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల్లో 2024-2025 ఏడాది గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ప్రవేశాల కోసం ఈనెల 26, 27 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు గురుకుల ప్రాంతీయ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలకు చెందిన బాలికలకు రాంరెడ్డిగూడ గురుకులంలో, 27న బాలురకు జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మి షన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

- మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు రేవంత్‌రెడ్డిదే బాధ్యత
- బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మేకల శిల్పారెడ్డి

వనపర్తి అర్బన్, జూలై 24 : మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు హోంశాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే వ్యవహారాల్లో తలమునకలై ఉన్నాడని, మహిళలపై ఏ చిన్న అఘాయిత్యం జరిగినా మహిళా మోర్చా ముందుండి పోరాటం సాగించాలని, అదేవిధంగా, బెల్ట్ షాపులను ఎత్తివేసే వరకు పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు నుంచి జాతీయ పార్టీ ఆదేశం మేరకు ప్రతీ నాయకురాలు కూడా పోలింగ్ బూత్‌లో అత్యధిక సంఖ్యలో మహిళల సభ్యత్వం చేయించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాని మోదీ మహిళల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి బీజేపీ గెలిచేలా కార్యాచరణ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. నిన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. అంతకుముందు ఆమె బడ్జెట్‌ను స్వాగతిస్తూ పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర సహకోశాధికారి ఎన్.జ్యోతి రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అలివేలు, మాజీ జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు సూగూరు లక్ష్మి, పట్టణాధ్యక్షుడు బచ్చు రాము, ప్రధాన కార్యదర్శి సూగూరు రాము తదితరులున్నారు.

పాఠశాల సమయంలో ఆర్టీసీ బస్సులు నడపాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, జూలై 24 : పాఠశాల సమయంలో ఆర్టీసీ బస్సులు నడపాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభయ్యే సమయానికి మన ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందించామన్నారు. విద్యార్థులు సరైన సమయానికి పాఠశాలకు చేరేందుకు సరిపడా బస్సులు నడపాలని, బస్సుల కొరత తీర్చాలని మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందిస్తూ కొత్త బస్సులు నడిపి విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే అమరచింత, నర్వ, మాగనూరు, కృష్ణ, ఊట్కూర్ తదితర ప్రాంతాలకు సమయానికి బస్సులు అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని బస్సులు నడపడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. కొత్త బస్సులు మంజూరు చేసి కొత్త రూట్‌లలో నడపాలని ఆయన కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

» కాయకల్ప బృందం



జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప టీం సభ్యులు

గద్వాల న్యూటౌన్, జూలై 24 : ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాయకల్ప బృందం సభ్యులు సూచించారు. జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, వార్డులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రికి వస్తున్న, వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు, కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు ఎన్ని పరీక్షలు చేస్తున్నారన్న విషయాన్ని ఆరా తీశారు. బయోమెడికల్ వేస్టేజీకి సంబంధించిన వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో కాయకల్ప టీం సభ్యులు అమీర్‌పేట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్, నేషనల్ హెల్త్ మిషన్ కన్సల్టెంట్ డాక్టర్ రాధిక, షేర్ ఇండియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంత్, జిల్లా ఆసుపత్రి సూపరిండెంటెండ్ డాక్టర్ నవీన్‌క్రాంతి, ఆర్ఎంవో డాక్టర్ వృశాలి, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజశేఖర్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువేద, శానిటేషన్ సూపర్‌వైజర్లు బాబు, షమీద్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.

డీకే అరుణ రాజీనామా చేయాలి

» టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.40 లక్షల కోట్ల బడ్జెట్‌లో పాలమూరు జిల్లాకు నాలుగు రూపాయలు కూడా కేటాయించలేదని, డీకే అరుణ ఎంపీ పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలను కరపత్రాలు ముద్రించి ఓట్లు వేయించుకున్నారని, అందులో ఏ హామీకి కూడా నిధులు తీసుకురాలేకపోయారని విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా అన్నారని, కనీసం ప్రాజెక్టుపై ప్రస్థావన లేదని, అదే పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత తమదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతుంటే అక్కడే ఉన్న ఎంపీ డీకే అరుణ బల్లలు చరుస్తూ మద్దతు పలకడం బాధాకరమన్నారు. నారాయణపేట ఓట్లతో ఎంపీగా గెలిచిన మీరు కనీసం నారాయణపేట టెక్స్‌టైల్ పార్కును కూడా సాధించలేకపోయారని దుయ్యబట్టారు. మీ పార్లమెంట్ పరిధిలో ఒక్క ప్రాజెక్టుకైనా ఒక్క రూపాయి సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఇందుకు నైతికబాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. మీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే కనీసం కోటి రూపాయలు కూడా బడ్జెట్‌లో ఎందుకు పెట్టించలేకపోయారని ఆయన నిలదీశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానిమోదీతో పాటు కేంద్ర మంత్రులను కలిసి వినతులు సమర్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయినా ఏ ఒక్క రంగానికి నిధులు కేటాయించకపోడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో నాయకులు సీజె బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

విరిసిన బ్రహ్మ కమలం



విరబూసిన బ్రహ్మ కమలాలు

జడ్చర్ల, జూలై 24 : జడ్చర్ల పట్టణంలోని న్యాయవాది తిరుపతి ఇంట్లో బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి. మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో ఉన్న బ్రహ్మకమలం మొక్కలకు పుష్పాలు వికసించాయని, ఆ మొక్కలు కేవలం కొన్ని గంటలు మాత్రమే వికసిస్తాయని ఆయన తెలిపారు. వికసించిన పుష్పాలను కాలనీవాసులు ఆసక్తిగా తిలకించారు.

అడవి జంతువు దాడిలో రెండు మేకలు మృతి

వంగూరు, జూలై 24: అడవి జంతువు దాడిలో రెండు మేకలు మృతి చెందాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం నిజంబాదలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మోగిలి నాగరాజు తన పొలంలో మేకలను కట్టివేశాడు. మంగళవారం రాత్రి అడవి జంతువు మేకలపై దాడి చేయడంతో రెండు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. చిరుత సంచరిస్తున్నట్లు వదంతులు వినిపిస్తుండంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బీట్ ఆఫీసర్ వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అడవి జంతువు పాదముద్రలను పరిశీలించారు. ఇది హైనా కావచ్చని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అచ్చంపేటటౌన్, జూలై 24: తాళం వేసిన ఇంట్లో నగదు, తులం బంగారం దొంగలించారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వేంకటేశ్వర కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చిలుకూరి చంద్రమౌళి ఈ నెల 19న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కి వెళ్లారు. తిరిగి ఈ నెల 23న ఇంటి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలి ఉండటం గమనించాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా ఉన్న కొంత నగదు, తులం బంగారం దుండగులు ఎత్తుకెళ్లారు. చిలుకూరి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఉప్పునుంతల, జూలై24: విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని తిర్మలాపురం గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు జిల్లెల మల్లారెడ్డి ఎద్దు మేత కోసం వెళ్లిన సమయంలో పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గతంలో పశువులు మృతి చెందాయి. ఎన్నో సార్లు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బంది సమస్యను విన్నవించినా స్పందించడం లేదని రైతులు వాపోయారు.

వనపర్తిలో స్పోర్ట్స్ స్కూల్

» స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి

» దేశానికే క్రీడాకారులను అందించే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ

» ప్రతీ జిల్లాలో స్పోర్ట్స్ అభివృద్ధికి 50 ఎకరాల భూమి కేటాయింపు



మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 24 : స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తనకు తన స్వంత జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడమే తన మొదటి ప్రాధాన్యత అని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. బాధ్యతలు చేపట్టిన తరువాత శివసేనారెడ్డి మొదటిసారి నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేవలం హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోనే స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయని, నాల్గవ స్కూల్ వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేయడమే తన కర్తవ్యమన్నారు. రాష్ట్రంలోనే ఉన్న ఏకైన అకాడమీ హాకీ వనపర్తిలోనే ఉందని, అలాంటి వనపర్తిలో టర్ఫ్ కోర్టును రానున్న మూడు నెలల్లో ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తానన్నారు. స్పోర్ట్స్‌లో 23వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని నెంబర్‌వన్ స్థానానికి తీసుకొచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. దేశానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ జిల్లాకు 50 ఎకరాల భూమిని స్పోర్ట్స్ కోసం కేటాయించేలా చూస్తామని, గతంలో ఎన్నడు కేటాయించనంత బడ్జెట్ ఈసారి స్పోర్ట్స్ కోసం కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువకులు మత్తుకు బానిసలు కావడం వల్ల క్రీడల్లో, చదువుల్లో రాణించలేకపోతున్నారని, యువతను మత్తుకు దూరం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. గడిచిన పదేళ్లలో క్రీడలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాజకీయాల్లో సున్నా నుంచి నేడు ఈ స్థాయికి వచ్చానని, ప్రతీ కార్యకర్త కష్టాలు తనకు తెలుసన్నారు. ఎవ్వరికి ఏ ఆపద వచ్చిన తనకు ఒక్క మెసేజ్ పెట్టాలని, పెట్టిన పావుగంటలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను తుంగలో తొక్కాలి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను రాష్ట్రంలో దరిదాపుల్లో లేకుండా తుంగలో తొక్కాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం శివసేనారెడ్డి సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో స్పోర్ట్ అభివృద్ధికి రూ.30 నుంచి రూ.40 కోట్లు విడుదల చేయాలని కోరారు. పదేళ్ల దుర్మార్గపు పాలన నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కోలుకుంటున్నారని, పార్టీ కోసం అహర్నిశలు పని చేసిన వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలు కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నాకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాసులు, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పీసీసీ డెలిగేట్ శంకర్‌ప్రసాద్, శంకర్‌నాయక్, ధనలక్ష్మి, రాచాల యుగంధర్‌గౌడ్, కౌన్సిలర్ బ్రహ్మంచారి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

28న జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ

» హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

» కల్వకుర్తిలో బహిరంగ సభ

» ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

» సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



ఎమ్మెల్యేలతో కలిసి జైపాల్‌రెడ్డి విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కల్వకుర్తి, జూలై 24 : కల్వకుర్తి పరిధిలోని ఒకటవ వార్డు కొట్రతండా చౌరస్తాలో ఏర్పాటు చేసే కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఈ నెల 28న మధ్యాహ్నం 3:30గంటలకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో అధికారికంగా 15వేల మందితో ఏర్పాటు చేసే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి పరిధిలోని కొట్రతండా గేటు వద్ద జైపాల్‌రెడ్డి విగ్రహం ఏర్పాట్లను, కల్వకుర్తిలో సీఎం బహిరంగ సభ స్థలాన్ని, హెలిప్యాడ్‌ను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీగైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతానికి చెందిన కేంద్రమాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం జరిగే బహిరంగ సభకు జైపాల్‌రెడ్డి అభిమానులు, సీఎం రేవంత్‌రెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులకు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఏర్పాట్లను శరవేగంగా చేపట్టాలని, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ ఆశిత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. జైపాల్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు చింతల రమణారెడ్డి, నాయకులు కాయితీ సాయిరెడ్డి, ఎన్నం భూపతిరెడ్డి, షానవాజ్‌ఖాన్, కౌన్సిలర్లు ఎజాస్, బాలు, పలువురు నాయకులు తదితరులున్నారు.

ఏర్పాటు పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి

కల్వకుర్తి, జూలై 24 : కల్వకుర్తి పట్టణ పరిధిలోని ఒకటవ వార్డు కొట్రగేటు వద్ద కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహ ఏర్పాటు పనులను మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలతో కలిసి మంత్రి జూపల్లి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, వెంకటయ్యగౌడ్, సంతుయాదవ్, బాలునాయక్, పలువురు నాయకులు తదితరులున్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

తెలకపల్లి, జూలై 24 : మర్డర్ కేసులో ముగ్గురికి నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదీతోపాటు జరిమానా విధించిందని ఎస్ఐ నరేష్ తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గడ్డంపల్లికి చెందిన పద్మమ్మ అనే వివాహితను 2014లో వరుసకు మరిది అయిన గాల్‌రెడ్డి అతడి భార్య ఇందిరమ్మ, కూతురు హరిత కలిసి హత్య చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ముగ్గురు నిందితులకు ఏ1 గాల్‌రెడ్డి రూ. 15వేలు, ఏ2 ఇందిరమ్మ రూ. ఐదు వేలు, ఏ3 హరిత రూ. ఐదు వేలు జరిమానా విధించి జీవిత ఖైదు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. సమర్థవంతంగా సాక్ష్యాలను సేకరించి, నేరం నిరూపణ చేసేలా పని చేసిన తెలకపల్లి ఎస్ఐ, కోర్టు కానిస్టేబుల్ స్వామిని ఎస్పీ ప్రశంసించారని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

కల్వకుర్తిటౌన్, జూలై24 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ తండాకు చెందిన ముడావత్ హర్య అనే వ్యక్తి సారా తరలిస్తున్నట్లు గుర్తించి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ టీం సభ్యులు బుధవారం తెలిపారు. అలాగే వెల్దండం మండలంలోని కళ్యాణి వాస తండా, రామోజీతండా, పిల్లికండ్లతండాలో జరిపి దాడుల్లో 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి సిబ్బంది మహేష్, నార్య రఘు, బిమమ్మ, పరుశురామ్ పాల్గొన్నారు.

పత్తి పంటను దున్నేసిన గుర్తు తెలియని వ్యక్తులు

మల్దకల్, జూలై 24 : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం, బూడిదపాడు శివారులోని తన పొలంలో సాగు చేసిన పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టరుతో దున్నేశారని రైతు బోయ పరమేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగిందని, సీడ్‌పత్తి విలువ రెండు లక్షల రూపాయలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అచ్చంపేట టౌన్, జూలై 24: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రాము బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని మల్లంకుంట చెరువు సమీపంలోని కాలువలో గుర్తుతెలియని మహిళ(40) మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించగా దాదాపు రెండు,మూడు రోజుల క్రితం మృతి చెందినట్లు ఉందన్నారు. మృతదేహాన్ని మార్చరికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన మహిళకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కల్లు దుకాణాలపై అధికారుల దాడులు

గద్వాల, జూలై 24 : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రంలోని కల్లు దుకాణాలపై బుధవారం ఎస్‌టీఎఫ్ టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్స్ డ్రగ్స్, డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఇన్‌స్పెక్టర్ రాములు నాయక్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. రెండు రోజుల క్రితం కల్లు తాగిన వారి మూత్రం, రక్తనమూనాలు, ప్రస్తుతం దుకాణాల్లో విక్రయిస్తున్న కల్లు నమూనాలను సేకరించినట్లు తెలిసింది. కల్లు తయారీలో వినియోగించే పదార్థాలను స్వాధీనం చేసుకొని శ్యాంపుల్స్ తీసుకున్నట్లు సమాచారం. దాడులు జరుగుతున్నాయనే విషయం తెలియడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దుకాణాల్లో మూసుకొని వెళ్లిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నమూనాల సేకరణ జరుగుతున్నా విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యార్థిని అదృశ్యం

నవాబ్‌పేట, జూలై 24 : ఇంటర్మీడియేట్ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం.. నవాబ్‌పేటకు చెందిన మంత శివలత, శివరాజు రెండవ కూతురు మంత వర్షిత జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈనెల 22న ఉదయ ఇంటి నుంచి కళాశాలకని బయలు దేరివెళ్లిన విద్యార్థిని రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు బుధవారం నవాబ్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని వీరశెట్టిపల్లికి చెందిన వడ్డె దశరథ్ కుమారుడు అరవింద్‌పై తమకు అనుమానం ఉన్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత దాడిలో పాడి ఆవు మృతి

అమ్రాబాద్, జూలై 24: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామ శివారులోని అడవిల చిరుత పులి దాడిలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకొంది. జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుంటల ప్రభావతమ్మకు చెందిన పశువులు సమీపంలోని అడవి ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లగా చిరుత పులి దాడిచేసి పాడి ఆవును చంపింది. ఈ పాడి ఆవు విలువ సూమారు. రూ. 30 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 24 : ప్రమాదవశాత్తు క్రూజర్ వాహనం ఎక్కుతుండగా కింద పడి సమీర్‌మోడీ(48) మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నిర్వహించిన చండీయాగంలో పని చేయడానికి పశ్చిమబెంగాల్‌కు చెందిన సమీర్‌మోడీ వచ్చి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లేందుకు మంగళవారం రాత్రి క్రూజర్ వాహనంలో ఎక్కుతుండగా కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి తమ్ముడు భగీరథ దాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రుణమాఫీ అర్హుల జాబితా తేల్చండి

» రైతు భరోసాపై కాలయాపన

» నిరుద్యోగుల ఆశలు, ఆకాంక్షలపై నీళ్లు చల్లారు

» విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, జూలై 24 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే అర్హుల జాబితాను తేల్చాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. వానాకాలం సీజన్‌ను రైతులు మొదలుపెట్టి మొక్కజొన్న, జొన్న పంటలు పొట్టకొచ్చే స్థాయిలో ఉన్నాయని, బోరుబావుల కింద వరి నాటు మొదలై 20 రోజులు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రైతు భరోసా పథకాలను రైతులకు అందించలేకపోతోందని అన్నారు. రైతుభరోసా కేబినెట్ ఉప సంఘం కాంగ్రెస్ కార్యకర్తలతో అభిప్రాయాలు సేకరిస్తు రైతులకు పెట్టుబడి సాయం అందించకుండా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రుణమాఫీకి అర్హులైన జాబితాను వెల్లడించడం లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ లక్ష లోపు రుణమాఫీ 11 లక్షల 22వేల మందికి మాత్రమే వర్తింపజేసేలా విధివిధానాలను రూపొందించారని అన్నారు. భూమి పాసుబుక్ ఉండి బ్యాంకుల్లో రుణాలు ఉంటే మాఫీ చేస్తామని, షరతులు విధించబోమని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పేర్లలో అక్షరం పాటు దోషమున్నా రుణమాఫీ చేయకుండా రైతులను బ్యాంకులు వ్యవసాయ కార్యాలయాల చుట్టు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విడతల వారీగా రుణమాఫీ 39 లక్షల మందికి వర్తింపజేశామని, రైతులందరికీ 11 సార్లు రైతుబంధు వేసినట్లు గుర్తు చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ యువతను కించపరుస్తున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 8 కాంగ్రెస్, 8 బీజేపీ సీట్లు సాధించి రాష్ట్రానికి నిధులు తేలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. మండల కేంద్రంలోని గంగపుత్ర కాలనీలో గంగమ్మ అమ్మ వారి ఉత్సవాల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణనాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బిజినేపల్లి, జూలై 24 : వితంతు మహిళతో అసభ్యం గా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వి వరాల మేరకు మండలంలోని వెలుగొండ గ్రామానికి చెం దిన ఓ వితంతు మహిళకు దాయాదుల మధ్య కొంత కాలంగా భూవివాదం ఉంది. తన భర్త చనిపోయి తొమ్మి ది సంవత్సరాలు కావడంతో ఇప్పటి వరకు తన పేరు మీద భూమి చేయకుండా దాయాదులు వేధిస్తున్నారని గ్రామానికి చెందిన మధుసూదన్ అనే వ్యక్తిని ఆశ్రయిం చింది. ఇరువురు మధ్య సయోధ్య కుదిరించి బాధిత మ హిళ పేరుపై భూమిని రెవెన్యూ రికార్డులలో చేర్పించాడు. తీరా బాధిత మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో మధుసూదన్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

» కల్వకుర్తి డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు

కల్వకుర్తిటౌన్, జూలై24 : కులంపేరుతో గిరిజనమహిళను దూషించిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు కల్వకుర్తి డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లికల్‌తండాకు చెందిన గిరిజన మహిళను కులంపేరుతో దూషించాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. సాక్షుల వివరాలను సేకరించి కల్వకుర్తికి చెందిన దేరంగుల వెంకటేష్ అనే వ్యక్తిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా అగౌరవంగా మాట్లాడిన, దాడులు చేసివారి హక్కులకు భంగం కలిగించినా న్యాయస్థానంలో నేరం రుజువైతే కఠినచర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్‌పై నేడు అవిశ్వాసం

» ఎదుర్కొంటారా? రాజీనామా చేస్తారా?

» సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జడ్చర్ల మునిసిపల్ కార్యాలయం

జడ్చర్ల, జూలై 24 : నేడు జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస పరీక్ష పెట్టనున్నారు. అవిశ్వాసం నెగ్గేనా... వీడేనా..? అన్న సందేహం సర్వత్రా నెలకొంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం కోరడంతో ఈ నెల 25న ఉదయం 11గంటలకు అవిశ్వాసానికి సంబంధించిన సమావేశం నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జడ్చర్ల మునిసిపాలిటీలో 27వార్డులకు 2021లో ఎన్నికలు జరగగా 23 మంది బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెరో ఇద్దరు కౌన్సిలర్లు గెలిచారు. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి సమక్షంలో దోరేపల్లి లక్ష్మి మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికై, పదవి చేపట్టారు. సుమారు పదేళ్ల పాటు పాలకవర్గం లేకుండా, కేవలం అధికారుల పరిపాలన సాగిన జడ్చర్ల మునిసిపాలిటీకి పాలకవర్గం ఏర్పడడంతో మునిసిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకుంటాయని పట్టణ ప్రజలు భావించారు. అందుకు భిన్నంగా పాలకవర్గం సభ్యులలో అత్యధికంగా కౌన్సిలర్లు అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్లాట్లు కబ్జా చేసారని, ఇళ్ల నిర్మాణాల యజమానులతో చేతివాటం ప్రదర్శించారని, పదవిని అడ్డంపెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసారన్న ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలోనే సంచలనంగా పందుల తరలింపు అంశంలో చైర్‌పర్సన్ భర్తపై రూ.కోటి రూపాయలకు పైగా అవినీతికి పాల్పడ్డాడని, పందులను విక్రయించాడంటూ పందుల పెంపకందారుడు చేసిన ఆరోపణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. వార్డులకు రూ.5 లక్షలు కేటాయించే విధంగా ఎజెండా రూపొందించాలన్న కౌన్సిలర్ల డిమాండ్లను చైర్‌పర్సన్ పట్టించుకోలేదని, ఈ అంశంలో సైతం చైర్‌పర్సన్ భర్త అజమాయిషీతోనే ఎజెండాను తయారు చేసారని ఆరోపిస్తూ కౌన్సిల్ సమావేశాన్ని పాలకవర్గం సభ్యులు బహిష్కరించారు. అనంతరం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటూ 18 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు ఈ నెల 25న అవిశ్వాసంపై సమావేశం పెట్టాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటుకు అన్ని చర్యలు చేపట్టారు.

ఏం జరుగుతుంది?

జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి గురువారం నిర్వహించే అవిశ్వాసాన్ని ఎదుర్కొంటారా.? లేక ఆ లోగా తన పదవికి రాజీనామా చేస్తారా అంటూ పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత మునిసిపాలిటీకి పాలకవర్గం ఏర్పడడం, అందులోనూ మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కడంతో దోరేపల్లి లక్ష్మికి చైర్‌పర్సన్‌గా, పాలాదిసారికకు వైస్‌చైర్‌పర్సన్‌గా అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అవకాశం కల్పించారు. ఈ మేరకు వారిరువురు పదవీ బాధ్యతలు చేపట్టారు. కాగా అధికార పార్టీలో ఉన్న కౌన్సిలర్ల మధ్య సఖ్యత లేకపోవడం కారణంగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి. అవిశ్వాసం ఎదుర్కోవాలా? లేక తన పదవికి రాజీమానా చేయాలా ? అనే సందిగ్ధంలో చైర్‌పర్సన్ ఉన్నట్లుగా తెలిసింది. కాగా రాజీనామా చేయడానికే సిద్ధమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రజల ఆరోగ్యమే మన బాధ్యత

- డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ

మిడ్జిల్, జూలై 24 : ప్రస్తుత సీజన్‌లో ప్రజలందరికి వైద్యం మరింత మెరుగ్గా అందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆరా తీశారు. ప్రజలందరి ఆరోగ్యమే మన బాధ్యతగా వ్యవహరించి పేదలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా మందులు ఉన్నాయో లేవా అనే విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకాంత్, సుభాష్‌చంద్రబోస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఔషధ మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 24 : స్కూల్ ఎర్త్‌క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థల ఆధ్వర్యంలో డీఈవో రవీందర్ సూచన ప్రకారం జిల్లాలోని రాజాపూర్, కూచూర్, వెన్నాచేడ్, ఎదిర షాసాబ్‌గుట్ట, సీసీకుంట, వేములు, ఆలురు ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఔషధ మొక్కలు నాటారు. కలబంద, సరస్వతి ఆకు, ఉసిరి, దానిమ్మ, గోరింటాకు, రణపాల, ఇన్సులిన్, తమలపాకు వంటి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు ఔషధ మొక్కలపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీజీఆర్ కోఆర్డినేటర్ కొత్తపల్లి రవి పాల్గొన్నారు.

ఉండేందుకు ఇల్లు ఇప్పించండి సార్..

- తహసీల్దార్‌కు ఇల్లు కూలిన బాధితుడి వినతి

మహమ్మదాబాద్, జూలై 24 : మండల పరిధిలో నంచర్ల గ్రామంలో మంగలి పెంటయ్య ఇల్లు ఇటీవల కూలిపోగా, ఆ కుటుంబం పాత గ్రామపంచాయతీ భవనంలో ఉంటున్నది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంచాయతీ భవనం కూడా కారు తుండడంతో తనకు ఆశ్రయం కల్పించాలని బాధిత పెంటయ్య తహసీల్దార్ తిరుపతయ్యను కోరాడు. దీంతో తహసీల్దార్ బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. పెంటయ్య కుటుంబం ఉండేందుకు పాఠశాలలోని ఓ గదిని కేటాయించామని తహసీల్దార్ తెలిపారు. బాధితుడు అక్కడ ఉండేందుకు ఇబ్బంది పడుతుండడంతో పక్కనే గుడిసె ఏర్పాటు చేసినట్లు తెలి పారు. బాధితుడు తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



పాత పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

- ట్రాఫిక్ సీఐ అజిజొద్దీన్



ప్రమాదరహిత వారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోలీసు సీఐ, ఆర్టీసీ ఆర్ఎం

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 24 : ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమైనదని, ప్రతీ ఒక్కరు బస్సుల్లోనే ప్రయాణం చేయాలని టు టౌన్ ట్రాఫిక్ సీఐ అజిజొద్దీన్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ డిపోలో ప్రమాదరహిత వారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి పోలీస్ సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 30 సంవత్సరాలు ఎలాంటి ప్రమాదాలు చేయకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించిన వారికి అభినందనలు తెలిపారు. అన్ని వాహనాల కంటే ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎంతో సురక్షితమని అన్నారు. కార్య క్రమంలో పాల్గొన ఆర్.యం శ్రీదేవి డ్రైవింగ్‌పై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. విధుల్లో ఉన్న డ్రైవర్లు ఏకాగ్రతతో విధులు నిర్వహించాలని అన్నారు. పలువురు డ్రైవర్లను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎం సుజాత, డిపో సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

రాజాపూర్, జూలై 24 : మండల పరిధిలోని బీబీనగర్ గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు విజయ్‌రాథోడ్ తన స్వంత ఖర్చులతో ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో విజయ్ రాథోడ్, లక్ష్మణ్ నాయక్, గోపాల్ నాయక్, పత్యానాయక్, బాలునాయక్, శ్రీనునాయక్, ఉపాధ్యాయులు రమాదేవి, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలను విస్మరించిన కేంద్రం



జడ్చర్లలో మాట్లాడుతున్న బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్

జడ్చర్ల, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలను విస్మరించిందని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ఆరోపించారు. జడ్చర్లలోని బీసీ సేన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలకు కేవలం రూ.2,200 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఈ బడ్జెట్ దేశంలో ఉన్న 70కోట్ల మంది బీసీలకు ఒక్కపూట భోజనానికి సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమం కోసం పాటుపడని బీజేపీకి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, 60శాతం రిజర్వేషన్‌లు, బీసీ కులగుణన, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలతో కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.50వేల కోట్లు కేటాయించాలని, బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాచారం శ్రీనివాస్, మురళీ, వెంకటేశ్, రాములు, ఆంజనేయులు, రమణ, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- మిల్లీమహాజ్ కన్వీనర్ తఖీహుస్సేన్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 24 : మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని మిల్లీమహాజ్ మహబూబ్‌నగర్ కన్వీనర్ తఖీహుస్సేన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకున్నారన్నారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుక వెళుతామని అన్నారు. సమావేశంలో చీఫ్ ప్యాట్రన్ అన్వర్‌పాషా, కో కన్వీనర్లు ఖుద్దుస్‌బేగ్, హఫీజ్ ఇద్రిస్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో..

తెలంగాణకు తీరని అన్యాయం

- మహబూబ్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బుధవారం తెలంగాణ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విభజన హామీలో తెలంగాణకు దక్కాల్సిన ఏ ఒక్క హామీని కూడా బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో నెరవేర్చలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఇస్తామన్న హామీని కూడా నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకులు పసుల రాజు, పాలమూరు లేబర్ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ, తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులు బుర్ర సురేశ్, ప్రగతిశీల ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షులు పులిజాల రవికిరణ్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో : బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ బడ్జెట్‌లో తీరని అన్యాయం చేశారని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేదరికానికి, నిరక్షరాస్యతకు, వలసలకు నిలయమైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి కాని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కాని నిధులు కేటాయించకపో వడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేశ్, కొండపల్లిరాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి.రాజు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.శంకర్, చాంద్‌పాషా, ఎస్.సంతోష్, సత్యనారాయణరెడ్డి, అబ్దుల్ జబ్బార్, మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

● ప్రభుత్వ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలి : టీఎన్జీవోస్

కేంద్రబడ్జెట్‌లో ఉద్యోగులకు పెద్దగా ఒరిగిందేమీ లేదని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 12 నెలలకాలం పనిచేసి కేవలం తొమ్మిదిన్నర నెలలు మాత్రమే జీతం పొందుతున్నారని, రెండున్నర నెలల జీతం ఇన్‌కమ్ టాక్స్ రూపేణ ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- సల్లోనిపల్లి పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్/ హన్వాడ, జూలై 24 : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం హన్వాడ మండలం సల్లోనిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. పిల్లలు పాఠాలు సరిగా చదవలేకపోవడంతో విద్యార్థులకు బట్టీ పట్టడం కాకుండా అర్థమయ్యే విధంగా చదువు చెప్పాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. అంతకు ముందు కలెక్టర్ హన్వాడ శివారులోని 718 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి ఉందని సర్వేయర్, తహసీల్దార్‌ను అడిగారు. ఆమె వెంట రెవెన్యూ ఆదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, తహసీల్దార్ కిష్టానాయక్, రెవె న్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల సంతతిని తగ్గించాలి : కలెక్టర్

కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, మునిసి పాలిటీలలో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున వాటి సంతతిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. జంతుజనన నియంత్రణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆపరేషన్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. బుధవారం పట్టణంలోని మౌలాలి గుట్ట ప్రాంతంలో గల జంతుజనన నియంత్రణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. జంతు నియంత్రణ కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, మెడిసిన్, శునకాలకు ఇచ్చే ఆహారం వంటి విషయాలను అక్కడి సిబ్బంది, ఇన్‌చార్జి కౌశిక్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భూత్పూర్, జడ్చర్ల మునిసిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీలలోనూ జంతునియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి శునకాల సంఖ్యను తగ్గించాలని ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, భూత్పూర్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఈఈ బసవరాజు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ విజయేందిర

మునురు వర్షానికి కూలిన ఇల్లు



యన్మనగండ్లలో కూలిన ఇల్లు

నవాబ్‌పేట, జూలై 24 : వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి ఓ ఇల్లు కూలింది. మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో సాకలి నడిమింటి సాయన్న మిద్దె పెంకుటిల్లు బుధవారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇల్లు కూలిపోవడంతో తాము రోడ్డున పడ్డామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని సాయన్న కుమారులు నాగరాజు, రాఘవేందర్ కోరారు. మండలంలో కూలిన ఇళ్ల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ నన్యా నాయక్ తెలిపారు. ఎక్కడైనా నష్టం జరిగిన ఘటనలు ఉంటే తమ కార్యాలయంలో తెలియజేయాలని మండల ప్రజలను కోరారు.

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల, జూలై 24 : గుండె సంబంధిత వ్యాధితో మహబూబ్‌నగర్ సుస్రుత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూసాపేట మండల పరిధిలోని తాళ్ళగడ్డకు చెందిన నారాయణగౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతున్న పోల్కంపల్లికి చెందిన సుదర్శన్‌గౌడ్‌ను, నందిపేట గ్రామానికి చెందిన మూసాపేట వైస్ఎంపీపీ రవీందర్‌రెడ్డి భార్య ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆమెను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మూసాపేట, అడ్డాకుల బీఆర్ఎస్ నాయకులు వున్నారు.

ప్లంబర్ పనులపై శిక్షణ

దేవరకద్ర, జూలై 24 : ప్లంబర్ నేర్చుకునేవారికి మండల కేంద్రంలోని ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ జైపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 18 సంవత్సరాల నుంచి 30 ఏళ్లలోపు ఉన్న యువకులకు 8, 10, డిగ్రీ చదివిన యువకుల కోసం ఉచితంగా ప్లంబర్ శిక్షణ ఇస్తామన్నారు. యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలేపల్లి సెజ్‌లో కార్మికులకు టీబీ నిర్ధారణ పరీక్షలు

జడ్చర్ల, జూలై 24 : జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఓ ఫార్మ పరిశ్రమలోని కార్మికులకు బుధవారం టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, డీటీసీఓ డాక్టర్ రఫీక్ ఆధ్వర్యంలో ఈ వైద్యపరీక్షలు నిర్వహించారు. టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ ఎక్స్‌రేతో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సత్యప్రసాద్, ప్రేమ, యువరాజు, శ్రీధర్, వహీద్, గోపాల్, యాసిన్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా వాసికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 24 : మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఖోఖో క్రీడాకారిణి సూరమోని రజినికి గౌరవ డాక్టరేట్ వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో వ్యాయామ విద్యా విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ ప్లైమెట్రిక్ ట్రైనింగ్ ఆన్ ద సెలెక్టెడ్ మోటర్ ఎబిలిటి ఎమాంగ్ కాలేజ్ బాస్కెట్ బాల్ ప్లేయర్స్ ఎట్ హైదరాబాద్ రీజియన్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ఓయూ పరీక్షల విభాగం నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఆమె సోషల్ వెల్ఫేర్ సొసైటీలో డిగ్రీ జూనియర్ కళాశాలలో పీడీ విధులు నిర్వహిస్తున్నారు.



రజిని

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

మహబూబ్‌నగర్, జూలై 24 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లాలో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. భారీగా కేక్‌లు తయారు చేయించి కట్ చేసి, తోటి వారికి పంచిపెట్టారు.

మహబూబ్‌నగర్ పట్టణంలో నాయకులు కోరమోని నర్సింహులు, కొరమోని వెంకటయ్య, గంజి ఎంకన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంధుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ చురుకైన పాత్రపోషించారని, రాష్ట్రం ఏర్పాటైన తరువాత దశాబ్దకాలంపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఐటీటవర్ ఏర్పాటు వెనక శ్రీనివాస్‌గౌడ్ కృషి, కేటీఆర్ సహకారం ఎంతో ఉందన్నారు.

● భూత్పూర్ : మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా మండలంలోని పాతమొల్గర గ్రామ శివారులో ఉన్న చెక్‌డ్యాం వద్ద మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో కేక్ కట్ చేశారు. మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

● హన్వాడ : హన్వాడలో పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ మండల అధ్యక్షుడు కొండ లక్ష్మయ్య, మాజీ జడ్పీటీసీ నరేందర్, మాజీ ఎంపీపీ బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.



పాతమొల్గర చెక్‌డ్యాం వద్ద మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆల, నాయకులు



మహబూబ్‌నగర్‌లో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● జడ్చర్ల : జడ్చర్లలో కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రఘుపతిరెడ్డి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అడ్డాకుల : అడ్డాకుల బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ పంచుకున్నారు. మాజీ జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి సమకూర్చిన గొడుగులను గ్రామస్థులకు పంపిణీ చేశారు.

● దేవరకద్ర : మండల కేంద్రంలో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

● బాలానగర్ : మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డితో కలిసి జడ్పీటీసీ కళ్యాణిలక్ష్మణ్ నాయక్ పులబొకే ఇచ్చి, శాలువా కప్పి, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ప్రకాష్, యాదయ్య, రాజేష్, రాములు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

నవాబ్‌పేట, జూలై 24 : మండలంలోని లింగంపల్లి, రుద్రారం, పోమాల గ్రామాల్లో గ్రామ దేవత పోచమ్మకు గ్రామస్థులు బుధవారం బోనాల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేకంగా బోనం కుండలో తయారు చేసిన నైవేద్యం తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామాన్ని, పిల్లా పాపలను, పంటలను సల్లంగా సూడాలని మొక్కుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల రాకతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, కృష్ణగౌడ్, పద్మనాభరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రుద్రారం రవి, వీరేష్, జినుగుంట యాదయ్య, కమ్మరి బాలకిష్టయ్య, వెంకట్‌రెడ్డి, చిన్న బాలయ్య, వెంకటేష్, బంటు పాండు, బ్యాగరి ఆంజనేయులు, నర్సింహులు, కుమార్, యువకులు పాల్గొన్నారు.

గండీడ్‌లో బోనాల పండుగ

గండీడ్ : మండల కేంద్రంలోని పోచమ్మ దేవతరకు బుధవారం మహిళలు బోనాల ఉత్సవం నిర్వహించారు. పోచమ్మ దేవాలయం వద్దకు చేరుకొని ఘనంగా నైవేద్యం సమర్పించారు. మహిళలు అందరిని చల్లగా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.



రుద్రారంలో బోనాలతో వస్తున్న గ్రామస్థులు

గ్రామాలలో చెరువును తలపిస్తున్న రోడ్లు

- ముసురు వానకు చిత్తడిగా మారిన రోడ్లు

చిన్నచింతకుంట, జూలై 24 : మండలంలోని ఉంద్యాల గ్రామంలోని రోడ్డు చినుకు పడితే చాలు చెరువును తలపిస్తున్నది. గ్రామంలో గతంలో సీసీ రోడ్డు కోసం తవ్విన అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వదిలేశారు. ఉంద్యాల నుంచి చిన్నచింతకుంట వరకు దాపుగా బీటీ రోడ్డు వేశారు కానీ గ్రామంలోని ప్రధాన రోడ్డుపై సీసీ రోడ్డు వేయటంపై నిర్లక్ష్యం కనిపిస్తున్నది. వర్షాలకు రోడ్డు చెరువును తలపిస్తున్నది. కాలినడకన కూడా వెళ్లలేని విధంగా రోడ్డు మారింది. ఇక పర్దీపూర్ గ్రామ శివారులోని తండాలు అభివృద్ధికి నోచుకోవటం లేదు. నిత్యం తండావాసులు తమ అవసరాల నిమిత్తం దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్దీపూర్ గ్రామానికి రావాల్సిందే. తండాలకు మట్టిరోడ్డు కూడా సక్రమంగా లేకపోవటంతో, చినుకు పడిందంటే చాలు తండారోడ్డు చిత్తడిగా మారిపోతుంది. రెడ్యానాయక్ తండా, పర్లకుంట తండా, మాల్యానాయక్, జమ్ములానాయక్ తండాల రహదారులు బురదమ యంగా మారాయి. నిత్యావసర సరుకుల కోసం పర్దీపూర్‌కు వెళ్లాలన్నా ఆ బురదనీటిలోనే జారుకుంటూ రాకపోకలు సాగిస్తుంటారు. బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపటం జరిగిందని, మంజూరు కూడా అయ్యిందని సంబంధిత అధికారులు డీఈ అనిల్‌కుమార్ తెలిపారు.



దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం దగ్గర చిత్తడిగా మారిన రోడ్డు

బురదమయంగా అడ్డాకుల సంత

అడ్డాకుల : వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు అడ్డాకుల కూరగాయల సంత బజార్ బురదమయంగా మారింది. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూరగాయల కోసం సంతకు వచ్చిన మహిళలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడ చూసినా మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన రావడంతో గ్రామ యువకులు సోషల్ మీడియా ద్వారా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. తైబజారు ద్వారా టాక్స్‌లు వసూలు చేస్తూ సంతలో సౌకర్యాలు కల్పించకపోతే ఎలా అని వ్యాపారులు ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సంతలో నీరు నిల్వవుండకుండా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన అడ్డాకుల సంతబజార్



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వర్షానికి రోడ్డు చిత్తడి

దేవరకద్ర : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ముసురు వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి. ప్రజలు రోడ్లపై నడవటానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మట్టి వేసి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.